ముగిసిన వాస్క్యులర్ వర్క్‌షాప్



సాక్షి సిటీబ్యూరో: దేశంలోనే తొలిసారిగా నగరంలో నిర్వహించిన వాస్క్యులర్ యాక్సెస్ వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. గచ్చిబౌలిలోని ఆరీట్ హాస్పిటల్లో, వాస్క్యులర్ సొసైటీ ఆఫ్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల సహకారంతో, ప్రత్యేకంగా వాస్క్యులర్ యాక్సెస్ మీద ఆధారపడి ఒక ప్రాక్టికల్ వర్క్‌షాప్‌ను 2రోజుల పాటు నిర్వహించారు. ఈ రెండు రోజుల వర్క్‌షాప్‌కు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి వాస్క్యులర్ సర్జన్లు, నెఫ్రాలజిస్టులు, ప్రభుత్వ, ప్రైవేట్ హాస్పిటల్స్ కు చెందిన పీజీ వైద్య విద్యార్థులు హాజరయ్యారు. ఈ వర్క్‌షాప్‌కు కోర్సు డైరెక్టర్‌గా డాక్టర్ చంద్రశేఖర్ చెవుటూరు వ్యవహరించారు ఆసుపత్రి చైర్మన్ డాక్టర్ విజయేందర్ రెడ్డి, ఈడి ప్రభాకర్ రాజు కొండా, ఎండి వాసుగుట్ట, డాక్టర్ పవన్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు


ఊరపోచమ్మ తల్లి

రాయదుర్గం: రాయదుర్గంలోని శ్యామ్‌లేట్ వీధిలోని ఊరపోచమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ప్రతి ఆదివారం ఆలయంలో అమ్మవారికి అష్టోత్తర పూజ, అభిషేకాలు చేస్తారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

రోగులకు పండ్లు పంపిణీ



రాయదుర్గం: కొండాపూర్‌లోని ఏరియా ఆస్పత్రిలో ఆదివారం రోగులకు పండ్లు, టిఫిన్లు పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్ర హోంగార్డుల ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్ నాయకత్వంలో పలువురు హోంగార్డులు పంపిణీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ వెంకట్ రావు, వెంకటరమణ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు సమస్య


దీప్తిశ్రీనగర్ కాలనీలో..

మియాపూర్: చందానగర్ డివిజన్ పరిధిలోని దీప్తిశ్రీనగర్ కాలనీలో మ్యాన్‌హోళ్ల నుండి మురుగునీరు పొంగి రోడ్డుపై ప్రవహిస్తుంది. గత నెల రోజులుగా మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తున్న పట్టించుకునే వారు లేరని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై మురుగు నీరు నిల్వడంతో దుర్వాసన, దోమలు పెరుగుతున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించాలని ప్రజలు కోరుతున్నారు.

రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మధు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ రామకృష్ణనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా కె. మధు విజయం సాధించారు. ఆదివారం హోరాహోరీగా జరిగిన సొసైటీ ఎన్నికల్లో కాలనీవాసులు పాల్గొని ఓటుహక్కును వినియోగించుకున్నారు. జనరల్ సెక్రటరీగా మధు, కోశాధికారిగా టి. రాజును ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా ఎన్నికైన మధు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో భారీ మెజార్టీతో గెలిపించినందుకు కాలనీవాసులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీల కతీతంగా కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాచర్ల భద్రయ్య, రాధాబాయి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి అన్నారు. ఆదివారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వందరోజుల ప్రణాళికలో భాగంగా తెల్లాపూర్లో నైబర్‌హుడ్ అసోసియేషన్ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. చెరువు పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాల వారికి మంచి వాతావరణాన్ని ఇవ్వాల్సిన బాధ్యత ఉందన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఒక మొక్క అయినా నాటాలని కోరారు.


హఫీజ్‌పేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తరగతి గదులకు రంగులు వేసిన దృశ్యం




శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం (బయట వైపు)

బయట పగుళ్లు .. లోపల రంగులు!

హఫీజ్‌పేట్ ప్రాథమిక పాఠశాల దుస్థితి


పెచ్చులూడిన స్లాబు

చందానగర్ : పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. బీటలు వారిన స్లాబ్.. వర్షం కురిస్తే తరగతి గదుల్లోకి నీరు.. అపరిశుభ్రంగా మరుగుదొడ్లు.. క్రీడాస్థలంలో వాహనాల అక్రమ పార్కింగ్.. ఇలా పలు సమస్యలు ఉన్నాయి. వాటిని వదిలేసి తరగతి గదులకు రంగులేసి మమ అనిపిస్తున్నారు అధికారులు. ఇది చూసిన వారు విస్తుపోతున్నారు. బడులు తెరిచే సమయం దగ్గరపడుతుండడంతో పాఠశాలలకు మరమ్మతులు, వసతులు కల్పనపై దృష్టి సారించారు. హఫీజ్‌పేట్ ప్రాథమిక పాఠశాల బిల్డింగ్ శిథిలావస్థకు చేరగా మరమ్మతులు చేయాల్సిన అధికారులు భవనం లోపల రంగులు వేయిస్తున్నారు. ఇక భవనం బయట గోడలు పగుళ్లు బారాయి. వర్షాకాలం చిన్నపాటి వర్షానికే తరగతి గదుల్లోకి వర్షపు నీరు చేరుతుంది. ముఖ్యంగా పాఠశాల ఆవరణలో మరుగుదొడ్లు, కొళాయిలు అపరిశుభ్రంగా ఉన్నాయి. ఈ పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 172 మంది విద్యార్థులు, 7 మంది ఉపాధ్యాయులు, ఒక హెచ్‌ఎం ఉన్నారు. పలు


విరిగిపోయిన కుళాయిలు

మార్లు పాఠశాల సమస్యలపై ఎంఈఓ, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు ఆవేదన చెందుతున్నారు. పాఠశాల భవనానికి తక్షణమే మరమ్మతులు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టాలి



ప్రభుత్వ పాఠశాల ఆవరణలో, లోపల ఉన్న మరుగుదొడ్లను శుభ్రం చేయించాలి. జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించాలి. – మహేష్ యాదవ్, హఫీజ్‌పేట్

మరమ్మతులు చేయాలి



పాఠశాల భవనానికి మరమ్మతులు చేయాలి. వర్షం వస్తే చాలు పాఠశాల లోపలికి వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లేదా నూతన భవనం నిర్మించాలి. – మల్లేష్ గౌడ్, హఫీజ్‌పేట్

కనువిందు..

మాదాపూర్: బెంగుళూరుకు చెందిన కూచిపూడి కళాకారులు నృత్యప్రదర్శనతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం కూచిపూడి నాట్యగురువు శ్రీలాస్య ఎడార శిష్యబృందం నృత్యప్రదర్శన అలరించింది. ఇందులో జయము జయము, గణపతి తాళం, అర్థనారీశ్వర సూత్రం, రుక్మిణి ప్రవేశం, గజవదన బెదువే, ముద్దుగారే యశోద, స్వాగతం కృష్ణ, కృష్ణం కలయసఖి, తిల్లాన తదితర అంశాలను కళా



కారులు సాయిరాగ, తేజస్విని, శ్రీలాస్య, మానివ్రత, శాన్వి, అనన్య, సహస్ర, వైష్ణవి, రిత్విక, హర్షిత రెడ్డి, సాయిసాన్విక, గౌరి తదితరులు ప్రదర్శించారు.



ముగిసిన గిగుల్ ఫెస్ట్ 2.0



మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో నిర్వహిస్తున్న గిగుల్ ఫెస్ట్ 2.0 ఆదివారంతో ముగిసింది. ఫ్యామిలీ కార్నివాల్ గిగుల్ ఫెస్ట్ సీజన్– 2కి హైదరాబాద్ డెయిరీ సిడ్స్ ఫారం టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరించింది. నగరవాసులు వినోదభరిత కార్యక్రమాలలో పాల్గొని సరదాగా గడిపారు. స్టాళ్ళు, లైవ్ పెర్ఫామెన్స్‌లు, వర్క్‌షాపులు , పిల్లలకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జోన్‌లు ఆకట్టుకున్నాయి.

పల్లకీసేవ.. అన్నదానం

మోతీనగర్: మూసాపేట డివిజన్ పాండురంగనగర్‌లో శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ముగింపు సందర్భంగా బాలభోగం, ద్వార తోరణం ధ్వజ కుంభారాధనం, మూలమంత్ర ఆహ్వానం, బలి హరణం, మహాపూర్ణాహుతి, కుంభప్రోక్షణం, శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి శాంతి కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు మహా అన్నదానం చేశారు. శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, ప్రధాన వీధుల్లో శ్రీవారి పల్లకీ సేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్పొరేటర్ మహేందర్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ పాలక కమిటీ చైర్మన్ బాకారం బుచ్చయ్య, సభ్యులు అనుపమ, జై నర్సింలు, జి. రామకృష్ణారావు, డి. జనార్దన్ గౌడ్, పి. మల్లికార్జునరెడ్డి, నాగేశ్వరరావు, అనిల్‌కుమార్, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బడిబాట ర్యాలీలు

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని కొడకంచి, నల్తూర్ తదితర గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు అంగన్వాడీ టీచర్లతో కలిసి ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, వసతులను వివరించారు. బడిడు పిల్లలను బడిలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. అంగన్వాడి నుంచి ప్రభుత్వ పాఠశాలలోకి విద్యార్థులకు ప్రవేశాలు కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మొగిలి మాల, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వెంకటేశం, అంగన్వాడీ టీచర్లు ,సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



లీకేజీ.. రోడ్డుపై భారీ గుంత

మియాపూర్: మియాపూర్ మదీనాగూడలోని జాతీయ రహదారి నుండి ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ రోడ్డులో మూలమలుపు వద్ద తాగునీటి పైప్‌లైన్ లీకేజీతో నీరు వృథాగా పోతోంది. గత పదిరోజులుగా పైప్‌లైన్ పగిలి రోడ్డుపై నీరు పారుతుంది. గతంలో పలుమార్లు పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసినా ఫలితం లేదు. పైప్‌లైన్ పగిలినచోట భారీ గుంత ఏర్పడడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. మూలమలుపుపై గుంత ఏర్పడడంతో ఏం ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



చేపల మార్కెట్లు కిటకిట

మృగశిర కార్తెతో ఉదయం నుంచే బారులు తీరిన కొనుగోలుదారులు



చేపల మార్కెట్‌లో రద్దీ

నిజాంపేట్: ప్రతి సంవత్సరం మృగశిర కార్తె రోజు చేపలు తింటే ఆరోగ్యానికి మంచిదని ప్రజల విశ్వాసం. ఉబ్బసం, ఆయాసం ఉన్న వారికి చేపలు ఎంతో మంచిదని పెద్దలు చెబుతుంటారు. ఆదివారం మృగశిర కార్తె సందర్భంగా పలు చేపల మార్కెట్లు వినియోగదారులతో కిటకిటలాడాయి. వందలాది రకాల చేపలు రావడంతో విక్రయదారులతో మార్కెట్‌లు రద్దీగా మారాయి. మార్కెట్‌కు పెద్ద ఎత్తున చేపలు దిగుమతి అయినా కూడా ధరలు ఏమాత్రం తగ్గలేదు. రవ్వ, బొచ్చె, కొర్రమీను, టంటం, పాంప్లెట్, బంగారు తీగ వంటి పలు రకాల చేపలతో పాటు రొయ్యలు, పీతలు దిగుమతి అయ్యాయి. ప్రజలు పెద్ద ఎత్తున చేపలు కొనుగోలు చేసేందుకు ఎగబడ్డారు.

సీఆర్ ఫౌండేషన్‌లో సీటీ స్కాన్ ప్రారంభం

చందానగర్: కొండాపూర్ సీఆర్ ఫౌండేషన్‌లో రోటరీ క్లబ్ సౌజన్యంతో సీఆర్ పాలిక్ క్లినిక్‌లో సీటీ స్కాన్‌ను సత్య బొల్లి ప్రొఫిలిక్స్‌తో ప్రారంభించారు. సీటీ రిపోర్టింగ్ రూమ్‌ను డాక్టర్ కె.నారాయణ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొండాపూర్ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు తక్కువ ఖర్చుతో అందుబాటులో ప్రజలందరు ఉపయోగించుకోవచ్చన్నారు. అనంతరం డాక్టర్ నారాయణ మాట్లాడుతూ రోటరీ వారి చొరవ తీసుకొని సిటీ స్కాన్ ప్రారంభించినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ డెక్కన్ అధ్యక్షులు జస్విందర్ బార్గి, ప్రోగాం కోఆర్డినేటర్ మిస్టర్ నితీష్, డిస్టిక్ గవర్నర్ శరత్ చౌదరి, ప్రొఫెసర్ ప్రసాద్‌రావు, డాక్టర్ రజిని,


సీఆర్ పాలి క్లినిక్‌లో సీటీ స్కాన్ మిషన్‌ను ప్రారంభిస్తున్న సభ్యులు

ప్రొఫెసర్ బి.రంగారెడ్డి, చెన్నకేశవరావు, డాక్టర్ అరుణ, డాక్టర్ కేజియా, డాక్టర్ భరత్, డాక్టర్ ఉమా, రోటరీ క్లబ్ సభ్యులు శైలేష్, డాక్టర్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ సహకారం అందిస్తా

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- అమీన్‌పూర్‌లో ముదిరాజ్ భవన నిర్మాణానికి శంకుస్థాపన

పటాన్‌చెరు: నియోజకవర్గ పరిధిలోని ముదిరాజ్‌ల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతికి ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని నవ్య రోడ్డులో ముదిరాజ్ భవన నిర్మాణ పనులకు ఆయన ఆదివారం ఉదయం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలలోనూ ముదిరాజ్‌లకు తగు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో ముదిరాజ్‌లు అందించిన


పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవానందం, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరసింహగౌడ్, మాజీ కౌన్సిలర్లు చంద్రకళ గోపాల్, కొల్లూరి మల్లేష్, బాలరాజు, ఉపేందర్, కృష్ణ, బిజీలీ రాజు ,సంఘం ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

త్వరలో తెరుచుకోనున్న రైల్వేగేటు

రామచంద్రాపురం(పటాన్ చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదుల నాగులపల్లి, వెలిమెల గ్రామాల మధ్యలోని రైల్వే గేట్‌ను త్వరలో తెరవనున్నట్లు తెల్లాపూర్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు రాంబాబు గౌడ్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైల్వే అధికారులు గత కొన్ని నెలలుగా రైల్వే గేట్ మరమ్మతుల పేరిట మూసివేయడం జరిగిందని దీని కారణంగా రెండు గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని వివరించారు. గ్రామస్తులు ఈ విషయాన్ని మెదక్ పార్లమెంటు సభ్యులు రఘునందన్ రావు దృష్టికి తీసుకెళ్లగా పరిష్కరించడం జరిగిందన్నారు. అందులో భాగంగా రెండు మూడు రోజుల్లో రైల్వే గేటును తెరవనున్నట్లు వివరించారు. ఈ సమస్యను పరిష్కరించినందుకు ఎంపీ రఘునందన్ రావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

'నిరసనలు ఆగవు'

జిన్నారం (పటాన్‌చెరు): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని ప్యారానగర్ డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలు 124వ రోజుకు చేరుకున్నాయి. ఆదివారం నల్లవల్లి గ్రామంలో రిలే నిరాహార దీక్షలో వృద్ధులు, మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డంపుయార్డ్ కంపు మాకొద్దంటూ గ్రామస్తులు నినాదాలు చేశారు. స్థానికుల అభిప్రాయాలకు వ్యతిరేకంగా ప్రభుత్వం డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు అనుమతి ఇచ్చిందని .. డంపింగ్ యార్డ్ నిర్మాణ పనులు ఆపే వరకు తమ నిరసనలు ఆపేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

ఏసీ లేదు.. బస్సు ఆగదు

ఆరునెలలకే ఇదీ ఏసీ బస్‌షెల్టర్ల దుస్థితి


ఐఎస్‌బీ ప్రధానగేటు పక్కన, ఇన్ఫోసిస్ సంస్థ ఎదుట ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్

రాయదుర్గం: నగరంలో ఐటీ ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా నెలకొల్పిన నిరుపయోగంగా మారాయి. ఐటీ కారిడార్‌లో ఏర్పాటు టీఎస్‌ఐఐసీ సంస్థ గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ కూడలి నుంచి విప్రో సర్కిల్ మీదుగా ఔటర్ రింగురోడ్డుకు వెళ్లే రహదారిలో రెండు ఏసీ బస్ షెల్టర్లు ఏర్పాటు చేయించారు. రెండు ఏసీ బస్ షెల్టర్లలో ఒకదాన్ని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రధాన గేటుకు చేరువలో, ఇన్ఫోసిస్ సంస్థ ఎదురుగా ఏర్పాటు చేశారు. మరొకటి విప్రో కూడలి దాటిన తర్వాత ఐసీఐసీఐ బ్యాంకు ముందు ఏర్పాటు చేశారు. షెల్టర్లలో ఏసీ ఉండడంతో ఐటీ, ఇతర ఉద్యోగులకు ఉపయుక్తంగా మారాయి. కానీ 6 నెలల వరకు వీటిల్లో ఏసీలను కొనసాగించినా ఆ తర్వాత నిర్లక్ష్యం చేయడం, బస్సులు కూడా ఇక్కడ ఆగకపోవడంతో వీటి వినియోగం లేకుండా పోయింది. అలాగే తాగు నీటి సౌకర్యం, ఏటీఎం సౌకర్యం కూడా ఉపయోగం లేకుండా పోయింది.


విప్రో సర్కిల్ చేరువలో ఐసీఐసీఐ బ్యాంకు వద్ద ఉన్న బస్‌షెల్టర్

పొంచి ఉన్న ప్రమాదం

ఆల్విన్‌కాలనీ: మ్యాన్‌హోల్స్‌తో ప్రమాదం పొంచి ఉంది. మూతలు లేకుండా, శిథిలావస్థకు చేరుకున్న మ్యాన్‌హోల్స్‌తో ప్రజలు భయపడుతున్నారు. కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో పలు కాలనీలు, బస్తీల్లో మ్యాన్‌హోల్స్‌తో ప్రమాదాలు జరుగుతున్నాయి. రాత్రివేళల్లో వాహనదారులు మూతలు లేని మ్యాన్‌హోల్స్‌లో పడి గాయాలపాలవుతున్నారు. వర్షాకాలం ముంచుకొస్తున్న నేపథ్యంలో వర్షాలు కురిస్తే ఎక్కడ మ్యాన్‌హోల్ ఉందో తెలియని పరిస్థితి. మ్యాన్‌హోల్స్ సమస్యను అధికారుల దృష్టికి తీసుకు వచ్చినా ఫలితం లేదని స్థానికులు, సంక్షేమ సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు. చిన్నారుల



తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం ఈ ప్రాంతాల నుంచి రాకపోకలు జరుగుతున్న క్రమంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కూకట్‌పల్లి, ఆల్విన్‌కాలనీ, ఫేజ్ -1, ఫేజ్ -2, పంచమి కాలనీ, ఎల్లమ్మ బండ, ఆస్‌బెస్టాస్ కాలనీ, రిక్షా పుల్లర్స్ కాలనీ, భాగ్యనగర్ కాలనీ, జయానగర్, హైదర్‌నగర్ ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ నోర్లు తెరుచుకున్నాయి. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పటిష్టంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.


వివేకానందనగర్ డివిజన్‌లో బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం వద్ద..

ఆల్విన్‌కాలనీలో ..



